

## రేపు కొడంగల్‌కు ముఖ్యమంత్రి

**ప్రజాపక్షం /కొడంగల్ :** పండుగ వాతావరణ కనిపించేలా కొడంగల్ పట్టాణా న్ని ముస్తాబు చేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి.ముకుందరెడ్డి అధికారులకు సూచించారు. ఈనెల 8న ముఖ్యమంత్రి కొడంగల్‌లో పర్యటించనున్న సందర్భంగా వివిధ ఏర్పాట్లపై సమాచార పౌర సంబంధాల శాఖ, స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి, దేవా దాయశాఖ కమిషనర్ హనుమంతురావు, జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి జిల్లా అధికారులతో కలసి కడా కార్యాలయంలో సమీక్షసమావేశం నిర్వహించారు. వేదిక, సభ పార్కింగ్ ప్రాంగణం పరిధిలో ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. సౌండ్‌సిస్టమ్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అయన అధికారులకు సూచించారు. లైవ్ కవరేజ్ చేసే క్రమంలో డ్రోన్, వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కమిషనర్‌తో పాటు సమాచార పౌరసంబంధాలశాఖ అదనపు సంచాలకులు జగన్, కడ అధికారివెంకట్‌రెడ్డి, ఆర్ఐఇ రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాంగ్రెస్ పార్టీకోసం ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న కార్యకర్తలను పార్టీ అధిష్టానం గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని చర్లపల్లి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సమావేశం బుధవారం ఇసి నగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు గడ్డం యాదగిరి, బూడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్‌లు మాట్లాడుతూ పార్టీపై నమ్మకంతో ఎన్నో ఏళ్లుగా కృష్టి చేస్తున్న కార్యకర్తలు, గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయినా, వెనకడుగు వేయకుండా నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలను కాదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల నుండి వచ్చి చేరినా ఐక్యంగా పని చేస్తున్నామని తెలిపారు. నేరపూరిత వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీ కార్పొరేటర్ ఒంటెద్దు పోకడలను తీవ్రంగా ఖండించారు. సీనియర్ నాయకులకు అధ్యక్ష పదవి ఇస్తూ గత పార్టీల నుండి వచ్చిన వారికి గత చరిత్ర ఆధారంగా అవకాశాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, నిరజా రెడ్డి, బాలయ్యగౌడ్, మల్లేష్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులులతో కలిసిసర్పంచు రజిత తోకలసి మాజీ పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మాట్లాడుతూ, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగొలు కేంద్రంలోవరి ధాన్యం ను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శాంతు కుమార్ అంతిరెడ్డి , రైతులు గ్రామస్తులు పాల్గోన్నారు.

## మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా శ్రీరామ్‌చక్రవర్తి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు కార్పోరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా శ్రీరామ్ చక్రవర్తిని నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్నూరు కాపు కార్పోరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా శ్రీరామ్ చక్రవర్తిని నియమిస్తు ప్రకటించడం చారిత్రక నిర్ణయమని చాట్లపల్లి నర్సింగరావు అన్నారు. శ్రీరామ్ చక్రవర్తి న్యాయకత్వంలో మున్నూరు కాపు సమాజం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. కార్పోరేషన్ చైర్మన్‌గా ఎన్నికైనందున శ్రీరామ్ చక్రవర్తికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మేడ్చల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ అన్న కుమారుడు అభిషేక్ గౌడ్ వివాహం బుధవారం కొర్రేముల రోడ్డు జెకె కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు టిపిసిసి అధ్యక్షుడు బి మహేష్ కుమార్ గౌడ్, మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపి సర్వే సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ వేముల మమత గౌడ్, యూత్ అధ్యక్షులు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

# గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి వంచించిన కేంద్ర ప్రభుత్వం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పెంచిన వాణిజ్య సిలిండర్ల ధరలను తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్ డిమాండ్ చేసారు. గ్యాస్ సిలిండర్ల ధరల పెంపుదలను నిరసిస్తూ సిపిఐ బుధవారం ఇసిఐఎల్ క్రాస్ రోడ్స్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ గ్యాస్ ధరలను పెంచమంటూ తప్పుడు హామీలిచ్చి ఎన్నికలు పూర్తి కాగానే పెద్ద మొత్తంలో వాణిజ్య సిలిండర్ ధరను పెంచారన్నారు. గత ఆరు మాసాల కాలంలో ఆరు సార్లు గ్యాస్ ధరలు పెరిగాయన్నారు. వాణిజ్య సిలిండర్ ధరలు పెరగటం వల్ల టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్‌లాంటి చిన్న పాటి వ్యాపారాలు చేసుకొనే మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. దీంతో పాటు అన్ని హోటళ్లలోనూ తినుబండారాలపై ధరలు పెంచారన్నారు. ఫలితంగా గ్యాస్ ధరల పెరుగుదల పరోక్షంగా ప్రతి ఒక్కరిపై పడుతుందన్నారు. మరో పక్క డీజిల్, పెట్రోల్, ఆటో గ్యాస్ కొరత లేదని ప్రభుత్వాల మాటలు క్షేత్రస్థాయిలో అవాస్తవాలుగా కనపడుతున్నాయని, ఎక్కడ చూసినా పెట్రోల్ పంపుల్లో నో స్టాక్, బారులు తీరుతున్న వాహనదారులు కనపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, టి.సత్యప్రసాద్, కె.ధర్మేంద్ర, నారా నరసింహ, ఏఐవైఎఫ్‌కు చెందిన ఎం.శేఖర్, గందమల్ల మహేష్, హర్ష, సురేష్ గుప్తా, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్‌లో:** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు అడ్డుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు యేసురత్నం పిలుపునిచ్చారు. బుధవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో సిపిఐ రాష్ట్ర పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానల కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు యేసురత్నం పాల్గొని మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజల బ్రతుకులు దినదిన గండంగా మారుతున్నాయని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మోదీ అనాలోచిత నిర్ణయాలవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు,కోశాధికారి సదానందం, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, నాయకులు సహదేవ్‌రెడ్డి, రాజు, కొమ్ము వెంకటేష్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.





**పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలి**

**జవహర్‌నగర్‌లో :** కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం నిరంతరం పెంచుతున్న ఇంధన ధరల వల్ల సామాన్యుల నడ్డి విరుగుతోందని తోటపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తక్షణ మే స్పందించాలని, తోటపల్లి శంకర్, సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, ఎఐటియుసి కాప్రా మండల అధ్యక్షులు అంబాల ఎల్ల య్య, కీసర మండల సహాయ కార్యదర్శి వి.రవి నాయక్, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో:** పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెంపుకు వ్యతిరేకంగా ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ అన్నోజిగూడ ఫ్లైవర్ బ్రిడ్జి వద్ద సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లొట్టి ఈశ్వర్, సయ్యద్ ఖదీర్‌లు మాట్లాడుతూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 3,100కు పెరగడంపై ప్రజలు హోటల్ యజమానులు సామాన్యులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. డీజిల్, పెట్రోల్‌పై లీటరుకు 5రూపాయలు చొప్పున గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు పెంపు నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆయిల్ కంపెనీలు బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సదాశివ, సిపిఐ నాయకులు మురళి, సయ్యద్ సాలార్, ఎఐటియుసి నాయకులు బి.పాండు, ఎన్ రాములు, బాల నరసింహ, ఎస్ అంజి, తదితరులు పాల్గొన్నారు.



**బోడుప్పల్‌లో :** బోడుప్పల్ సర్కిల్ 9వ, డివిజన్ వరంగల్ హైవే ఉప్పల్ బస్ డిపో ముందు మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో ఇంధన ధరల నియంత్రణ కోసం స్థిరమైన విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ తరపున కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, జి నాగరాజు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దండు రమేష్, బిసి సంఘం జిల్లా నాయకులు కె.ప్రమీల, బాపురాజు, బికేఎంయు మండల కార్యదర్శి అధ్యక్షులు కె.మహేల, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు రామతా ర, సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



**కూకట్‌పల్లిలో :** పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కూకట్‌పల్లి మండలం బాలానగర్ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.మనోచారి, దావీద్, రాములు, రాజుగౌడ్, హనుమంత్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సమూహాలుగా, ఎఫ్‌పిఓలుగా ఏర్పడి ప్రయోజనాలు పొందాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రైతులు ఒంటరిగా కాకుండా సమూహాలుగా, ఎఫ్‌పిఓలుగా ఏర్పడి బలంగా నిలబడాలని, తద్వారా తమ పంటలకు మార్కెటింగ్, రుణాలు వంటి లాభాలు సులభంగా పొందగలుగుతారని కోపరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్‌కో ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ పిఎస్ రాహుల్ రాజ్ రైతులకు సూచించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా మేడ్చల్ జిల్లా వ్యవసాయ శాఖ అధ్వర్యంలో రైతులకు మరింత ఉపయోగపడే లక్ష్యంగా ఈ నెల 9 వరకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు వారంలో భాగంగా శామీర్‌పేటలోని ఎఫ్ఎస్‌సిఎస సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, జెఆర్ సురేఖ రాణి, మేడ్చల్ జిల్లా సహకార అధికారి మధుకర్‌రెడ్డి, డైరెక్టర్లు, కెనరా బ్యాంకు లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, మూడుచింతలపల్లి చైర్‌పర్సన్ కంటం శిరీష, రైతు సంఘ సభ్యులు తదితరులు ఈ సమావేశం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్ప కాలిక పంట రుణాలు వరి ధాన్యం సేకరణ, ఇన్‌పుట్లు, నానో ఎరువులు, పంట రుణాలు, సహకార క్లబ్స్ అండ్ యువత భాగస్వామ్యం, ఎఫ్‌పిఓ సభ్యత్వం ఉపయోగాలు, మార్కెటింగ్ అండ్ డిజిటల్ పరివర్తన తదితర అంశాలపై చర్చ జరిపారు. .దీంతో పాటు సాయిల్ కలెక్షన్ దాని ప్రాముఖ్యత, సాయిల్ హెల్త్ కార్డు పంపిణీ, వాటి ఆధారంగా ఎరువుల వాడకం, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన, నానో యూరియా ప్రమోషన్, సహజ వ్యవసాయ విధానం, వ్యవసాయ నిర్వహణ, సన్న వరి రకాల సాగు అంశాలపై అవగాహన కల్పించామన్నారు.



## సహకార సంఘాలను బలోపేతం చేయాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘానికి పూర్వ వైభవం తీసుకరావాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని వ్యవసాయ సహకార సంఘంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే శామీర్‌పేట సొసైటీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో నాలుగెకరాల స్థలం తీసుకుని నిధులు కేటాయించి షాపింగ్ కాంప్లెక్స్‌లు, గోదాములు నిర్మించామని చెప్పారు. శామీర్‌పేటలోని రైతులు మేలురకమైన పంటలు పండిస్తారని ఆ దిశగా అధికారులు రైతులకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. రైతు వేదికలు వాడుకలో లేవని వాటిని వాడుకుని రైతులకు శిక్షణలు ఇవ్వాలని చెప్పారు. రైతులకు సకాలంలో రుణాలు ఇచ్చి వారు ఆర్థికంగా ఎదిగేందుకు సొసైటీ కృషి చేసిందని చెప్పారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు శామీర్‌పేట సొసైటీకి రూ.2 కోట్లు నిధులు కేటాయించి గోదాములు నిర్మాణం చేశామని చెప్పారు. కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని అంటున్నారని రుణమాఫీ అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. శామీర్‌పేటలో విస్తారంగా భూములు ఉన్నాయని ఆ భూముల్లో కూరగాయలు, పండ్ల తోటలు పండించి రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ కమిషనర్ రాహూల్, డిసిఒ నాగలింగాచారి,లీడ్‌బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, సురేఖ, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, సొసైటి వైస్ చైర్మన్ ఐలయ్య,రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కోలాహలంగా కొలను హన్మంత రెడ్డి జన్మదిన వేడుకలు

## ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంపేట్:కుత్బుల్లాపూర్** నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి జన్మదిన వేడుకలు కోలాహలంగా జరిగాయి. నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్‌లో పలు సేవా కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు జోరుగా నిర్వహించారు. బాచుపల్లి చౌరస్తాలో మాజీ కార్పోరేటర్ కొలను వీరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాన్ని కొలను హన్మంత రెడ్డి ప్రారంభించారు. అనంతరం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. నియోజకవర్గం నుండి పలు డివిజన్‌ల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు తరలివచ్చి హన్మంత రెడ్డిని శాలువాలు, గజమాలలతో సన్మానించి పూలగుచ్ఛాలను అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలిపారు. ప్రగతినగర్‌లో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి పలు సేవా కార్యక్రమాలను హన్మంత రెడ్డి ప్రారంభించారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌లతో పాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు విచ్చేసి హన్మంత రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూనే ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తాను ముందుండి పరిష్కరిస్తానని అన్నారు. తనను ఇంతగా ఆదరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలను తెలిపారు. ప్రజా సేవలో ఎల్లప్పుడూ ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని, నిరంతరం ప్రజాభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్‌లు, కాంగ్రెస్ నేతలు, అధికారులు, శానిటేషన్ సిబ్బంది పెద్దఎత్తున ర్యాలీలతో విచ్చేసి హన్మంత రెడ్డి చేతుల మీదుగా కేక్‌ని కట్ చేయించి శుభాకాంక్షలను తెలిపారు.



**పుట్టిన రోజు వేడుకల్లో కొసమెరుపు...**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో ఫ్లెక్సీల రగడ కొనసాగింది. మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్ రెడ్డి, 18వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జితేందర్‌ల మధ్య ఫ్లెక్సీలో ఫోటో పెట్టలేదంటూ ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఫ్లెక్సీల్లో తన ఫోటో ఎందుకు పెట్టలేదంటూ బాల్ రెడ్డి, జితేందర్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

## పగిలిన మంజీరా తాగు నీటి పైప్‌లైన్..

### వృథాగా పారుతున్న మంచినీరు

**ప్రజాపక్షం/కాప్రా :** మంజీరా తాగు నీటి పైప్ లైన్ పగిలి నీరు రోడ్లపై పారుతూ చెరువులను తలపిస్తుండటం మూడు రోజులుగా కొనసాగుతున్నప్పటికి అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా కనపరుస్తున్న నిర్లక్ష్యం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ పరిధిలోని వంపుగూడ ప్రాంతంలోని శాంతి విల్లాస్ కాలనీ ప్రధాన రహదారిపై సంబంధింత అధికారులు గత కొద్ది రోజులుగా చేస్తున్న పలు అభివృద్ధి పనుల్లో భాగంగా జెసిబితో తవ్వకాలు చేయసాగారు. ఈ క్రమంలో వారి తవ్వకాల్లో పొరపాట్ల వల్ల అక్కడి మంచి నీటి మంజీరా తాగు నీటి పైపు లైన్లు పగిలి పోయాయి. దీంతో ఒక్కసారి గా పగిలిన పైపుల నుండి మంచి నీరు ఉవ్వెత్తున ఎగిసి పడితూ రహదారంతా నీరు పారుతూ చెరువులా ప్రవహించసాగింది. ఫలితంగా వేల లీటర్ల శుద్ధి చేసిన మంచి నీరు వృథాగా పోతున్నా ఎంఎంసి అధికారులు జలమండలి అధికారులను పిలిపించుకొని సమన్వయంతో పరిష్కరించాల్సింది పోయి పట్టించుకోకుండా వెళ్లి పోవటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఏఎంసి, జలమండలి అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించి మంచినీరు వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.



## జవహర్‌నగర్‌లో గృహిణి అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ఇంటి నుంచి పనికి వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపుతోంది. ఎస్.హెచ్.ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాల పేట లో కలివల, గణేష్ అనే వ్యక్తి తన భార్య శ్వేత, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. గణేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత నెల 5వ తేదీన శ్వేత ఉదయం యధావిధిగా పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అయితే, సాయంత్రం అయినా ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. శ్వేత కోసం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో భర్త గణేష్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జవహర్ నగర్ పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఎస్ హెచ్ వో సైదు లు, జవహర్ నగర్ మహిళ ఆచూకీ తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరుతున్నారు.

## దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపనకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరు

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్ :** వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని కొలుకుంద గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమనికి హాజిరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ , ఈసందర్బంగా అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్పీకర్ మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలమాలు మన సంస్కృతి, సంప్రాదయాలకు ప్రతీక దుర్గామాత చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యలతో ఉండాలని అకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తన సహయ సహకరాలు ఎల్లప్పుడు ఉంటాయని హమీ ఇచ్చారు.

ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అలయక మిటీ సభ్యులు, స్థానికనాయకులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హెయిర్, స్కిన్, డెర్మటాలజీ క్లినిక్‌ల సీజ్

### జుట్టు మొలిపిస్తామంటూ పెద్ద మొత్తాల్లో వసూళ్లు




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:**నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న హెయిర్, స్కిన్ మరియు డెర్మటాలజీ క్లినిక్‌లపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు బుధవారం తనిఖీలు చేసారు.కెపిహెచ్‌బి కాలనీ ప్రాంతంలో నడుస్తున్న వావ్‌మెన్ స్కిన్ అండ్ కాస్మటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, హెచ్‌సి హెయిర్ క్రియేషన్స్, డెర్మో 360 కాస్మెటాలజీ, అమిస్టా కాస్మెటాలజీ పేరిట నడుస్తున్న క్లినిక్‌లు ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేసారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్లు లేక పోవటం, వైద్యార్హతలు లేకుండా వైద్య సేవలందించటం విషయాలపై అలోపతి చట్టం 2010 ప్రకారం వీటిని సీజ్ చేసామని పేర్కొన్నారు. అన్ని రకాల చర్మ వ్యాధులను నయం చేస్తామంటూ పెద్ద మొత్తాల్లో ప్యాకేజిల చొప్పున వసూలు చేస్తున్నప్పటికి నిర్వాహకులకు ఎలాంటి వైద్యార్హతలు లేవని డిఎంహెచ్ఓ డా.ఉమాగౌరి తెలిపారు. ప్రజారోగ్యం విషయంలో చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఆమె హెచ్చరించారు.

## సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యం



**ప్రజాపక్షం/కొందుర్గు:** పేదోడి సొంతింటి కలను నేరవేర్చాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలోని దళిత వాడకు చెందిన చిలుక సుమలత నర్సింహులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేయించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ బండమీది పెంటయ్య, రాములుగౌడ్, కావలి యాదయ్య, ఎండి ఫైమొద్దీన్, ఉప సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్, జిబి కృష్ణ, బోరుగే నరేందర్, భీమారం మాణెయ్య, వార్డు సభ్యులు దుర్గని శ్రీను, దేవాలయ చైర్మెన్ కృష్ణయ్య, పర్వతాపురం మాజీ ఎంపిటిసి మంజుల మల్లేష్ గౌడ్, బ్యాగరి రవి పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం



**ప్రజాపక్షం/కొత్తూరు:** పేద ప్రజల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు సూచించారు. బుధవారం మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా కొత్తూరు మెడికల్ ఆఫీసన్ దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాములు గౌడ్, పంచాయతీ కార్యదర్శి రవణీల, గ్రామ కమిటి అధ్యక్షుడు దయ్యాల శ్రీను, వార్డు సభ్యులు కృష్ణ, రాజు, చందర్, అంజయ్య, రాందాస్‌నాయక్, దయ్యాల మల్లేష్, వైద్యులు డాక్టర్ సరిత, సిహెచ్‌ఓ నాగేష్, ల్యాబ్ టెక్నిషియన్ శివశంకర్, ఆశవర్కర్లు విజయమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/కేశంపేట:** విద్యార్థినికి ఎన్‌ఆర్‌ఐ గోగు వెంకట్ నారాయణ రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన దిద్దెల కృష్ణమ్మ కుమార్తె దివ్యకు రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. డిగ్రీ పూర్తి చేసి పిజి విద్యను అభ్యసిసేందుకు గాను ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని తెలుసుకున్న ఎన్ఆర్ఐ గోగు వెంకట్ నారాయణరెడ్డి ముందుకు వచ్చి తక్షణ సహాయం కింద రూ.10 వేలు అంధించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రమోద్‌రెడ్డి ఉన్నారు.

## యాచారం సహకార సంఘం పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల సహకార సంఘం పాలకవర్గం బుధవారం తిరిగి బాధ్యతలను స్వీకరించారు. బుధవారం సహకార సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేంధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులందరికీ న్యాయం చేయడానికి వారి సమస్యలను పరిష్కరించడానికి మరో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ కారింగ్ యాదయ్య, డైరెక్టర్లు మల్లారెడ్డి, పాశ్చభాష, ఐలయ్య, మక్కపల్లి స్వరూప, కొండాపురం కళమ్మ, సిఇఒ నాగరాజు పాల్గొన్నారు.

## రైతుల ఆర్థిక అభివృద్ధి లక్ష్యం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయటమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామ సమీపంలో రైతు వేదికలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సహకార సంఘం, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతు వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, జాయింట్ రిజిష్టర్ రమాదేవి, లీడ్‌బ్యాంకు మేనేజర్ వంశీ, నాబార్డు డిడిఎం ఆకాస్, డిసిఓ సుధాకర్, ఎడిఎ సుజాత, పద్మజ, ఎఓ విద్యాధరి, పిఎసిఎస్ చైర్మన్‌లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కమిటీలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** డివిజన్‌లోని ఆరు మండలాలకు, రెండు మున్సిపాలిటీలకు కొత్త అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాయికల్ శ్రీనివాస్, కొందుర్గు మండల అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి, జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షుడిగా జాకారం చంద్రశేఖర్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడిగా దేపల్లి కుమార స్వామిగౌడ్, కేశంపేట మండల అధ్యక్షుడిగా రమేష్, షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కొత్తూరు మున్సిపల్ అధ్యక్షుడిగా జాండగూడెం సుదర్శన్ గౌడ్‌లను ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర పారిశుద్ధ్యంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉప్పల్ జోన్ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్(ఎస్ఎఫ్ఎ) ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సాట్ వాహనాలు ఎస్‌సిటిపిలకు లింక్ అయి రోజువారీ ట్రిప్స్ పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి ట్రిప్ రికార్డింగ్ తప్పనిసరి అన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ, స్వీపింగ్ పనులు పూర్తి స్థాయిలో అమలు కావాలని, సిబ్బంది హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. పారిశుద్ధ్యం సిబ్బందిని ఇతర పనులకు వినియోగించరాదని స్పష్టం చేశారు. రోడ్లపై చెత్తను వెంటనే జివిపి పాయింట్లకు తరలించి ప్రతిరోజూ తొలగించాలని ఆదేశించారు. మార్జిన్ ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది వివరాలు, గైర్హాజరు జాబితాలు నమోదు చేయాలని, అన్ని జివిపి పాయింట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మరో 20 రోజుల తర్వాత మళ్లీ సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

**అనధికార ప్రకటనలపై జరిమానాలు విధించాలి**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి కాప్రా సర్కిల్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. హైటెన్షన్ రోడ్ శ్రీనివాస్ నగర్, రాజరాజేశ్వరి కాలనీ, లక్ష్మి నగర్, వెస్టర్న్ బ్లిస్ కాలనీల్లో పరిస్థితులను సమీక్షించారు. హైటెన్షన్ రోడ్‌లో విద్యుత్ స్తంభాలపై అనధికార ప్రకటనలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. బాధ్యులపై జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. రోడ్లపై ఉన్న గ్రీన్, నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. శ్రీనివాస నగర్ పార్క్ నిర్వహణపై సమీక్షించి, డ్యామేజ్ అయిన ఆట వస్తువులను మరమ్మతు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వదిలిన ఇళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజరాజేశ్వరి కాలనీలో నాలా పూడికతీత పనులను పరిశీలించి వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. లక్ష్మి నగర్, వెస్ట్రన్ బ్లిస్ కాలనీల్లో దోమల నివారణ చర్యలను సమీక్షించి నిల్వ నీటిని తొలగించాలని ప్రజలకు సూచించారు.

## నగర అభివృద్ధిలో పౌర భాగస్వామ్యం ముఖ్యం



### సిఎంసి కమిషనర్ సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర అభివృద్ధిలో పౌర భాగస్వామ్యం ముఖ్యమని, 2027 జనగణనలో పాల్గొనాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన అన్నారు. రోజుకో వార్డు కార్యక్రమంలో భాగంగా 8వ రోజు కమిషనర్ కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కెపిహెచ్‌బి కాలనీలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్థానిక ఆటస్థలంలో పౌరులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఎ) ప్రతినిధులతో కమిషనర్ ముఖాముఖి చర్చలు జరిపారు. పౌర సౌకర్యాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్థానిక హాస్టళ్ల ఇబ్బందులు, రోడ్డుపై వంటలు, రహదారులపై అడ్డంగా వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్ల పాదచారులకు ఇబ్బందులు ఉన్నట్లు తెలిపారు. ఎంపి, ఎంఎల్‌ఎల కింద పెండింగ్ పనులపై కూడా ప్రస్తావించారు. మెహఫిల్ హోటల్ నుండి ఇందు ప్రాజెక్ట్స్ వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను పరిశీలించిన కమిషనర్, ట్రాఫిక్ క్రమశిక్షణ పెంపు, పబ్లిక్ ప్రదేశాల నిర్వహణ మెరుగుదలపై ఆదేశాలు జారీ చేశారు. చెత్తను మూలంలోనే వేరు చేయడం, పార్కుల్లో కంపోస్టింగ్ యూనిట్లు ఏర్పాటు, బల్క్ వ్యర్థాల కోసం వారపు సేకరణ విధానం అమలు చేయాలని సూచించారు. పర్యటనలో గుర్తించిన సమస్యలపై చర్యలు తీసుకుని ఎటిఆర్ నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.

## ప్రజా ఆరోగ్య వ్యవస్థ బలోపేతం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ వైద్యులు ఎప్పటికీ కట్టుబడి ఉంటారని, ఉద్యోగుల బదిలీల విషయంలో ప్రభుత్వం పారదర్శకమైన, సంప్రదింపులతో కూడిన విధానాన్ని అవలంభించాలని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.లాలుప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ మొహమ్మద్ ఖాజా రౌఫుద్దీన్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రజా ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్, వైద్య విద్య సంచాలకులు (డిఎంఇ ) డాక్టర్ నరేందర్ కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు బుధవారం వినతి పత్రాలను సమర్పించారు. ప్రస్తుతం అమలవుతున్న బదిలీల ఆన్‌లైన్ విధానంలో పారదర్శకత లోపించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నిఖాళీలనూ, బదిలీల ద్వారా ఏర్పడే ఖాళీలను పూర్తిస్థాయిలో చూపించడం లేదన్నారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యుల సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియకు తక్కువ సమయం కేటాయించడంతో వైద్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గుర్తింపు పొందిన అసోసియేషన్ ప్రతినిధులకు బదిలీల నుండి మినహాయింపునిస్తూ గతంలో ప్రభుత్వం జారీచేసిన జిఒను అమలు చేయాలని కోరారు. బదిలీల్లో తలెత్తే అభ్యంతరాల పరిష్కారానికి గడువుతో కూడిన ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఉద్యోగ బదిలీల ప్రక్రియలో వైద్యసంఘాల ప్రతినిధులను భాగస్వామ్యం చేసి సమస్యలను పరిష్కరించవచ్చని సూచించారు.

## విజయవంతంగా 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'

### టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 99 రోజులపాటు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి బడంగ్‌పేటలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపు కార్యక్రమలో ముఖ్య అతిధిగా చల్లా నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్టాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "యువత, క్రీడలు" 10 ప్రధాన అంశాలలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా మే నెలలో వేసవి సెలవుల్లో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలలో ప్రత్యేక స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపులను నిర్వహించి, విద్యార్థులకు, యువతకు క్రీడా శిక్షణ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కవితబాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, అర్కల భూపాల్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, విజవర్ధన్ రెడ్డి, హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ సంతోష్, శేఖర్‌రెడ్డి, మురళి గౌడ్, సుభాష్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన సిఎస్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఈనెల 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉన్నతాధికారులతో కలిసి ప్రధాని పర్యటనకు సంబంధించి హెచ్‌ఐసితోపాటు గచ్చిబౌలిలోని సింధు హాస్పిటల్‌లో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి చిన్న పొరపాటు జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా తమకు నిర్దేశించిన విధులను నిర్వహించాలని సూచించారు. సిఎస్ వెంట వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు పోలీస్‌శాఖ, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 4 వారాల విరామం

### పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

### కమిషనర్ ఏ.వి.రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణికి 4 వారాల పాటు విరామాన్ని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ప్రకటించారు. వేలాదిగా వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తున్నామని, మిగిలి ఉన్నవి కూడా క్లియర్ చేసేందుకే 4 వారాలు విరామాన్నిచ్చినట్టు బుధవారం హైడ్రా కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 8వ తేదీ నుంచి యథావిధిగా హైడ్రా ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ప్రజావాణితో పాటు వివిధ రూపాల్లో వచ్చిన ఫిర్యాదులన్ని పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ఈ విరామన్ని ప్రకటించామన్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుదారులు అత్యవసరమని భావిస్తే కార్యాలయానికి వచ్చి నేరుగా కలవచ్చు అన్నారు. ముఖ్యమైన సమస్యలున్నా నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని ఆయన తెలిపారు.

## ఆడపిల్లలకు అండ కళ్యాణలక్ష్మి , షాదీముబారక్

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** పేదింటి ఆడపిల్లల పెండ్లిలకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ పథకాలు అండగా ఉంటున్నాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం యాచారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ, గున్‌గల్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే నిర్వహించారు. కార్యక్రమాల్లో గడ్డమల్లాయగూడ గ్రామ సర్పంచ్ అచ్చన మంగ జంగయ్య ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రేస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో 310మంది లబ్ధిదారులకు 3కోట్ల 10లక్షల 35 వేల రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. నిరుపేదలు ఆడపిల్లల పెండ్లిలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రేస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎంపిడిఓ రాధరాణి, తహసీల్దార్ అయ్యప్ప, నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రేస్‌పార్టీ మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మ, బిఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు మస్కు అనిత, దెందిరాంరెడ్డి, కోలన్ బుచ్చిరెడ్డి, నీలం శ్రీవిధ్య, కృష్ణ, అరవింద్‌నాయక్, శంకర్, సుగుణ, కోలన్ రమాదేవి, అక్బర్, వుప్పల భాస్కర్, మస్కు రమేశ్ పాల్గొన్నారు.

# గ్యాస్ ధర పెంచి ప్రజలపై భారం మోపుతున్న కేంద్రం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అంబానీ, ఆదాని కార్పొరేట్ల ఆస్తులని కాపాడటమే నరేంద్ర మోదీ కర్తవ్యమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి విమర్శించారు. పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని, పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం రావి నారాయణరెడ్డి చౌరస్తాలో సిపిఐ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఏట్టకేలకు సిపిఐ నాయకులు కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ దేశంలో సామాన్య నిరుపేద ప్రజలు అధిక ధరలతో గ్యాస్ సంక్షొభంతో సతమతమవుతున్న సందర్భంలో గుజరాత్ వ్యాపారస్తుల ఆస్తులను పెంచడం కోసం నిత్యవసర వస్తువులపైన పెట్రోల్ డీజిల్‌పైన గ్యాస్ పైన ధరలు పెంచి సామాన్యుల పైన అధిక భారం వేసారని మండిపడ్డారు. యుద్ధం సాకుతో దేశ ప్రజలకి తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్మెట్ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, బిఒసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, మండల కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు పొన్నాల యాదగిరి, కాటీ అరుణ, వట్టి నవనీత, పేరాల గోపి, సైదులు ముదిరాజ్, దవుల రాములు, మంగలిపల్లి రవి, నరసింగం సుధాకర్, అశోక్, అనిల్, క్రాంతి ప్రియ, అన్నపూర్ణ, సుమలత, వీణ, రవళి, పాండు, నాగమణి, నిలా, కావేరి శోభన్ మరియు సిపిఐ, విద్యార్థి, మహిళ, యువజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**తుర్కయంజాల్:** గ్యాస్ ధర పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచుతున్న గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సిపిఐ ఆదిభట్ల సర్కిల్ కార్యదర్శి కాటంరాజు గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం తుర్కయంజాల్ కూడలిలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ యుద్ధాన్ని బూచిగా చూయించి ధరలు పెంచుతున్నారని, ప్రజలను దోచి కార్పొరేట్ శక్తుల ఖజానాలు నింపుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు శివ ప్రసాద్, బ్రహ్మయ్య, రోజా, సైదమ్మ, అలివేలు, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఐటి ఉద్యోగుల డ్రగ్స్ వ్యాపారం బట్టబయలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల పేరుతో నడుస్తున్న డ్రగ్స్ రాకెట్‌ను ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) బి టీమ్ ఛేదించింది. ముగ్గురు సాఫ్ట్వేర్ ఉద్యోగులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 7.44 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నిర్వహించిన ఆపరేషన్‌లో సీఐ బిక్షా రెడ్డి, ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలోని బృందం ఈ డ్రగ్స్ డీల్‌ను అడ్డుకుంది. ఐటి ఉద్యోగం కోల్పోయిన అంజద్ అనే యువకుడు డ్రగ్స్ వ్యాపారంలోకి దిగగా, హేమంత్ అనే మరో సాఫ్ట్వేర్ ఉద్యోగి పెట్టుబడి పెట్టాడు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి లాభాల్లో భాగస్వామ్యం చేసుకుందామని ఇద్దరూ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో, హరీష్ అనే మరో ఐటీ ఉద్యోగి డ్రగ్స్ కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో, ఎస్టీఎఫ్ బృందం రంగంలోకి దిగి వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, బెంగళూరులో గ్రాము రూ.2,000కు కొనుగోలు చేసిన ఎండిఎంఏను హైదరాబాద్‌లో రూ.8,000 నుంచి రూ.10,000 వరకు అమ్ముతూ భారీ లాభాలు ఆర్జిస్తున్నట్లు గుర్తించారు. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులను, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌తో పాటు హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు బీ టీమ్ లీడర్ ప్రదీప్ రావు తెలిపారు.ఈ ఘటనతో ఐటి ఉద్యోగుల డ్రగ్స్ నెట్‌వర్క్‌పై మరోసారి పోలీసుల దృష్టి పడింది.



## పార్టీ బలోపేతంపై కార్యాచరణ

**ప్రజాపక్షం/తార్నాక :** సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాయి బాబా జన్మదినోత్సవం సందర్భంగా తార్నాకలోని టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి నివాసంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి డిసిసి సికింద్రాబాద్ అధ్యక్షుడు దీపక్ జాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నాయకత్వంలో పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా టిటియూసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి మాట్లాడుతూ... సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించామని తెలిపారు.



## హైకోర్టు స్టే 'ధన్వంతరి' బాధితులకు ఊరట

### విక్టిమ్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టు కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** ధన్వంతరి ఫౌండేషన్ భూముల విక్రయాలను అడ్డుకోవద్దని కోరుతూ వేసిన పిటిషన్‌కు హైకోర్టు స్టే ఇవ్వడం ధన్వంతరి బాధితులకు పెద్ద ఊరట అని విక్టిమ్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టు కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ తెలిపారు. 20 ఏళ్లుగా ధన్వంతరిలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వేలాది మంది బాధితులకు ఇదొక విజయమన్నారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ధన్వంతరి నిర్వాహకులు కమలాకర శర్మ, జయశ్రీ, సుభాష్ బెయిల్‌పై వచ్చి ధన్వంతరి భూములపై స్టే ఉన్నా అమ్మేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. బాధితుల దగ్గర పెట్టుబడి పేరిట కోట్లు వసూలు చేసి భూములు కొన్న కమలాకర శర్మ కోర్టులో కేసు ఉన్నా భూములు అమ్మడం సరికాదన్నారు. వెంటనే సిసిఎస్ పోలీసులు స్పందించి.. ధన్వంతరికి చెందిన సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారంలో ఉన్న 70 ఎకరాలను, ఇతర ప్రాంతాల్లో ఉన్న భూమిని తమ అధీనంలోకి తీసుకోవాలని కోరారు. వీరికి బినామీలుగా ఉన్న శ్రీరంగం వెంకట అన్నపూర్ణ శర్మ, లక్ష్మయ్యలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కమలాకర శర్మ స్వతంత్రంగా బయటికొచ్చి ధన్వంతరి భూముల వివరాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ట్రస్టు కో–కన్వీనర్ విజయ్‌కుమార్, క్రిష్ణ దుర్గ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.




### 24X7 తొలి వార్తా పసారాధినేత

## సిఎన్‌ఎన్ వ్యవస్థాపకుడు టర్నర్ మృతి

**సిన్సినాటి :** ప్రపంచంలో మొదటిసారి ఇరవైనాలుగు గంటల వార్తా ప్రసారాల సృష్టికర్త, సిఎన్‌ఎన్ వ్యవస్థాపకుడు టెడ్ టర్నర్ కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. అమెరికా ఓహియో రాష్ట్రం సిన్సినాటిలో 1938 నవంబరు 19వ తేదీన ఆయన జన్మించారు. టర్నర్ బ్రాడ్ కాస్టింగ్ స్టేషన్ (టిబిఎస్),కేబుల్ న్యూస్ నెట్‌వర్క్‌లను ఆయన స్థాపించారు. వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్ కంపెనీ స్థాపించిన ప్రముఖుడుగా ఆయన ఖ్యాతికెక్కారు. అట్లాంటాలో ఉన్న ఒక అనామక టెలివిజన్ స్టేషన్‌ను ఆయన మొట్టమొదటి శాటిలైట్ ఆధారిత సూపర్ స్టేషన్‌గా మార్చి తన శక్తిసామర్థ్యాలు నిరూపించుకున్నారు. దక్షిణాది క్రీడాజట్ల యజమానిగా ఛాంపియన్ యాచ్ రేసర్‌గా ఆయన వ్యవహరించారు. టివి–6 వ్యవస్థాపకుడుగా, కెప్టెన్ ప్లానెట్ అండ్ ద ప్లానెటీర్స్ సహ వ్యవస్థాపకుడుగా ఖ్యాతి చెందారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1.75 మిలియన్ ఎకరాల భూమికి యజమానిగా, దేశంలోనే మూడోస్థానంలో ఉన్న భూస్వామిగా, వ్యాపారవేత్తగా కొనసాగారు. న్యూ మెక్సికోలో ఆయనకు 920 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో వెర్మెజో పార్క్ రాంచ్ ఉంది. ఆయన మూడు వివాహాలు చేసుకున్నారు. ఆయనకు ఐదుగురు సంతానం. ప్రముఖ నటి జేన్ ఫాండాతో పది సంవత్సరాలు వివాహబంధం కొనసాగించారు. టర్నర్ ఎంటర్‌ప్రైజెస్ విడుదల చేసిన ఆయన మరణవార్తను సిఎన్‌ఎన్ ప్రసారం చేసింది.

# తెలంగాణలో అవినీతిపై ఎసిబి ఉక్కుపాదం

### పదేళ్లలో 1500 మంది ప్రభుత్వ ఉద్యోగుల అరెస్ట్
### పోలీస్, రెవెన్యూ శాఖలే టాప్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నియంత్రణలో భాగంగా ఎసిబి దాడులు గత పదేళ్లలో గణనీయంగా పెరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 1500 నుంచి 1800 మంది ప్రభుత్వ ఉద్యోగులు వివిధ అవినీతి కేసుల్లో పట్టుబడ్డారు. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ శాఖలే అవినీతి కేసుల్లో ముందంజలో ఉన్నాయి. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న శాఖల్లోనే ఎక్కువగా లంచాల వ్యవహారం వెలుగులోకి వస్తోంది. మొత్తం కేసుల్లో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు సంబంధించిన కేసులే దాదాపు 50 శాతం ఉన్నాయి.

ప్రతి సంవత్సరం ట్రాప్ కేసులే అధికంగా నమోదవడం, వ్యవస్థలో అవినీతి ఇంకా బలంగా పాతుకుపోయినట్టే సూచిస్తోంది. అధికారులపై ఆదాయానికి మించి ఆస్తుల కేసులు కూడా నమోదవుతున్నప్పటికీ, వాటి సంఖ్య ట్రాప్ కేసులతో పోలిస్తే తక్కువగానే ఉంది. ఈ లెక్కన ప్రతి రెండు రోజులకు ఒక అవినీతి కేసు ఎసిబిలో నమోదవుతుంది. అవినీతి కేసుల్లో పట్టుబడుతున్న ఉద్యోగుల్లో ఎక్కువగా కింది, మధ్య తరగతి స్థాయి ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారు. 2016లో 80 నుంచి 100 కేసులు నమోదు అయితే, 2025లో 199 కేసులు నమోదు కాగా 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్ అయ్యారు. వీరిలో పోలీస్ శాఖ ముందంజలో ఉంది.

**అవినీతి నిరోధంలో ప్రజల పాత్ర కీలకం**

ప్రభుత్వ శాఖల్లో అవినీతి తగ్గించాలంటే డిజిటలైజేషన్, పారదర్శకత, కఠిన పర్యవేక్షణ తప్పనిసరి అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సేవలు పూర్తిగా ఆన్‌లైన్‌లో అందించడంతో పాటు, ప్రతి సేవకు గడువు విధించడం ద్వారా లంచాల అవకాశాలను తగ్గించవచ్చని వారు సూచిస్తున్నారు. అదేవిధంగా ఉద్యోగుల ఆస్తులపై క్రమం తప్పని తనిఖీలు, వేగవంతమైన విచారణలు, విశిల్‌బ్లోవర్‌లకు రక్షణ కల్పించడం ద్వారా అవినీతిని గణనీయంగా నియంత్రించవచ్చని వారు పేర్కొంటున్నారు.

**ధైర్యంగా ఫిర్యాదు చేయండి:**
**ఎసిబి చీఫ్ చారు సిన్హా**

"లంచం అడిగే అధికారులపై బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. బాధితులు నేరుగా ఎసిబి వాట్సాప్ నెంబర్ 9440446106, ఫేస్ బుక్ తెలంగాణ ఎసిబికి ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం" అని ఎసిబి డిజి చారుసిన్హా తెలిపారు.

అవినీతి కేసులు శాఖల వారీగా ఈ విధంగా ఉన్నాయి.

| శాఖ | శాతం | పట్టుబడుతున్నది(పదేళ్లు ) | పోస్టు |
|---|---|---|---|
| పోలీస్ | 20–25 | 300–400 | ఎస్ఐ, సిఐ, కానిస్టేబుళ్లు |
| రెవెన్యూ | 18–22 | 270–350 | తహసీల్దార్, ఆర్ఐ,విఆర్ఒ |
| మున్సిపల్ | 12–15 | 180–250 | బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు |
| పంచాయతీరాజ్ | 10–12 | 150–200 | ఎఇ, సెక్రటరీలు |
| విద్యా | 6–8 | 90–120 | హెడ్‌మాస్టర్లు, డిఇఒ, స్టాఫ్ |
| ఆరోగ్య | 5–7 | 70–110 | డాక్టర్లు, సూపరింటెండెంట్లు |
| విద్యుత్ | 5–6 | 70–90 | ఎఇ, లైన్ స్టాఫ్ |
| రిజిస్ట్రేషన్ | 4–6 | 60–90 | సబ్ రిజిస్ట్రార్‌లు |
| దేవాదాయ | 2–4 | 30–60 | ఇఒ, ఇన్‌స్పెక్టర్లు |
| ఇతర శాఖలు | 10–12 | 150–200 | వివిద హోదాలు |

# ఫీజుల దోపిడీ అరికట్టకుంటే ఉద్యమం తప్పదు

### టిఆర్ఎస్ వ్యవస్థాపకురాలు కవిత హెచ్చరిక



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎంవిఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 'నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ' రౌండ్ టేబ్ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ఈ నెలలోనే కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థల దోపిడీని అదుపు చేయాల్సిన ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజల ఖర్మ అని అన్నారు. ముఖ్యమంత్రి విద్యాశాఖపై సమీక్షలు చేయాల్సింది పోయి, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్తూ వారిని ప్రోత్సహించడం సిగ్గుచేటు అని విమర్శించారు. మే నెల రాగానే ఫీజుల పెంపుతో తల్లిదండ్రులు వణికిపోతున్నారని, ఒక్కో పాఠశాల 50 నుంచి 120 శాతం వరకు ఫీజులు పెంచుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎంఎస్7 జీవోను కవిత తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ జీవో ద్వారా ఫీజు రీయింబర్స్ మెంట్‌ను పూర్తిగా అటకెక్కించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో సైతం ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. మా పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ మాట తప్పితే.. నన్ను అమరవీరుల స్తూపం సాక్షిగా రాళ్లతో కొట్టండి అని ఆమె భావోద్వేగంగా పునరుద్ఘాటించారు.



## మురుగునీటి సమస్యను పరిష్కరిస్తాం

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** మురుగునీటి సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ హైవే క్రాసింగ్ వద్ద సీవర్ ట్రంక్ మెయిన్ పైప్‌లైన్ విస్తరణ పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. సాగర్ కాంప్లెక్స్ సమీపంలో త్రిమలానగర్, శ్రీశ్రీ హోమ్స్, మధురానగర్, మీర్‌పేట్ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు కలిసిపోవడం వల్ల వర్షాకాలంలో స్థానికంగా సమస్యలు ఏర్పడుతున్నాయని గుర్తించారు. అనంతరం జలమండలి హయత్‌నగర్ జోనల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎండీ అశోక్ రెడ్డి, అక్కడి సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో జలమండలి మల్కాజిగిరి రీజియన్ ఈడీ పంకజ, ఆపరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీజీఎం నాగేందర్, జీఎం మహేందర్ నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కురుమ సంఘంపై అసత్య ఆరోపణలు తగదు

### మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** కురుమ సంఘంపై కొంత మంది చేస్తున్న అసత్య ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం పేర్కొన్నారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేష్‌తో కలిసి మాట్లాడారు. తాను రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడుగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన 18 ఏళ్లలో ఆలయాల వద్ద వసతి గృహాలు, విద్యార్థి హాస్టళ్లు తదితర నిర్మాణాలతో సంఘానికి సుమారు రూ.2000 కోట్ల విలువైన ఆస్తులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు కురుమ సంఘం ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నించడం సరైంది కాదని హెచ్చరించారు. సంఘం అభ్యున్నతి కోసం పారదర్శకంగా పనిచేస్తున్నామని, ట్రస్ట్ బోర్డు పర్యవేక్షణలో లెక్కలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరికైనా సందేహాలు ఉంటే కార్యాలయానికి వచ్చి వివరాలు పరిశీలించవచ్చన్నారు. ముస్లింజంగ్ వంతెన వద్ద భవనం నిర్మాణానికి తాను రూ.50లక్షలు, చీటీల ద్వారా రూ.40లక్షలు సమీకరించామని, ప్రస్తుతం ఆ భవనం నుంచి అద్దె వస్తోందని తెలిపారు. యాదాద్రి, కొమురవెల్లి ప్రాంతాల్లో దాతల సహకారంతో వసతి గృహాలు నిర్మించామని చెప్పారు. మన్సూరాబాద్‌లో పాఠశాల భవనం నిర్మాణం చేపట్టి, కోకాపేట్‌లో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో కురుమల కోసం భవనం నిర్మాణం పూర్తి చేశామని వివరించారు. చీర శ్రీకాంత్ ఈ సందర్భంగా ఎగ్గే మల్లేశం నాయకత్వాన్ని అభినందించారు. సంఘ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలను ఖండించారు. సమావేశంలో బండారి నారాయణ, కొలుపుల నరసింహ, తూముకుంట అరుణ్ కుమార్, రెక్కల కొండల రాజ్, కె.శ్రీనివాస్, బాలమని, విజయలక్ష్మి, మిర్యాల విజయ తదితరులు పాల్గొన్నారు.

# పునరావాసంపై అపోహలు నివారించాలి

### అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పునర్వ్యవస్థీకరణ కమిటీ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో కొనసాగుతున్న స్వచ్ఛంద గ్రామ పునరావాసంపై మీడియాలో వస్తున్న కథనాలను ఉమ్మడి తరలింపు, పునర్వ్యవస్థీకరణ కమిటీ ఖండించింది. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ సభ్యుడు సాయి మాట్లాడుతూ, పునరావాస ప్రక్రియ స్వచ్ఛందంగా జరుగుతున్నదని స్పష్టం చేశారు. కొన్ని మీడియా వర్గాలు ఈ ప్రక్రియను బలవంతపు తరలింపుగా చిత్రీకరిస్తుండటం వాస్తవ పరిస్థితులకు విరుద్ధమని తెలిపారు. ఇలాంటి కథనాలు పునరావాసాన్ని స్వచ్ఛందంగా కోరుకుంటున్న అనేక కుటుంబాల ఆశయాలను, సమస్యలను పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. గత ఏడు సంవత్సరాలుగా ప్రభావిత గ్రామాలకు చెందిన కుటుంబాలు పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు తదితరులను సంప్రదిస్తూ వస్తున్నట్లు తెలిపారు. మెరుగైన విద్య, ఆరోగ్య సేవలు, ఉపాధి అవకాశాలు, రహదారి సౌకర్యాలు, గృహ వసతి,భద్రమైన భవిష్యత్తు కోసం స్వచ్ఛందంగా తరలివెళ్లాలనే ఆకాంక్షతో ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. ప్రస్తుతం నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని సర్లపల్లి, కుడిచింతల బైలు, తాటిగుండల్ పెంట, కొల్లంపెంట, వటవర్లపల్లి గ్రామాలలో పునరావాస కార్యక్రమం అమలులో ఉందని తెలిపారు. ఈ ప్రక్రియ జాతీయ పులుల సంరక్షణ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. పులుల సంరక్షణతో పాటు స్థానిక ప్రజల సుస్థిర జీవనోపాధి అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని పునరావాస కార్యక్రమం చేపడుతున్నామని కమిటీ వెల్లడించింది. పునరావాసంపై అపోహలు కలిగించే ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు.



తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్‌ను డిజిపి సివి ఆనంద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

# అయ్యప్పలో జోరుగా అక్రమ నిర్మాణాలు

### అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులు, కిందిస్థాయి సిబ్బంది,లక్షలలో అక్రమార్జన
### సిఎంసి కమిషనర్ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి





**అక్రమ నిర్మణాలపై కొరడా గులిపిస్తామంటూ తెలంగాణ ప్రభుత్వం ఏన్నో చర్యలు తీసుకుంటున్న హైడ్రా సైతం ఈ అక్రమ నిర్మాణాలపై ఎందుకు దృష్టి సారించడం లేదో అని ప్రజలు వాపోతున్నారు.**

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ప్రభుత్వం చందానగర్ సర్కిల్ నుండి శేరిలింగంపల్లి సర్కిల్ నుండి విడదీసి మాదాపూర్ సర్కిల్ 50 ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వం చందానగర్ సర్కిల్ పేరును మియాపూర్ సర్కిల్‌గా మార్పులు చేశారని, అధికారులను సైతం మార్చిన మాదాపూర్ సర్కిల్‌లో మాత్రం ఎక్కడ ఎటువంటి మార్పు చోటు చేసుకోకపోవడంతో పాటు అక్రమ నిర్మాణాలు మరింత భారీ స్థాయిలో పెరిగాయని ఏక్కడ చూసిన 7, 8 అంతస్థుల అక్రమ నిర్మాణాలతో పాటు భారీ స్థాయిలో అక్రమ షేడ్లు దర్శనమిస్తున్నాయని మాదాపూర్ వాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూతూ మంత్రంగా అధికారులు తమ విధులను నిర్వహిస్తుండడంతో పాటు మామ్ముళ్ళ మత్తులో తూలతుగుతుండడంతో అక్రమ నిర్మాణదారులు ఇష్టానుసారంగా నిర్మాణాలను చెపడుతున్నారని కోర్టు పరిధీలో ఉన్న అయ్యప్ప సోసైటీలో ఎటువంటి పర్మిషన్ లేకుండా 6,7,8 నుండి 9 అంతస్థుల వరకు అక్రమ నిర్మాణాలు చెపడుతుంటే అధికారులు ఏంచేస్తున్నారు అని సర్కిల్ వాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమర్జనయే ధ్యేయంగా పని చేస్తున్న మాదాపూర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్, ఎసిపి, టిపిఎస్, ఔట్ సార్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారని, వారిపై ఎందుకు ఎటువంటి చర్యలు ఉండవా అని ప్రజలు అధికారులపై దుమ్మేత్తి పోస్తున్నారు. అధికారులు లక్షలలో కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమ నిర్మాణాల జోలికి వేళ్ళడం లేదని కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ దృష్టికి తీసుకేళ్ళిన, ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన, మాదాపూర్ డిసికి, ఎసిపిలకు ప్రజలు ఏన్ని సార్లు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డురం అని వాపోతున్నారు.

అధికారులు మామ్ముళ్ళ మత్తులో కోట్లాది రూపాయలు వెనుకేసుకుంటు అక్రమ నిర్మాణాలకు పూర్తిగా సహకరిస్తున్నారని పేదవాడు ఏదైనా నిర్మాణాం చెపట్టలంటే ఏన్నో కండిషన్లు పేట్టి నాన ఇబ్బందులు పేట్టే అధికారులు తమకు కాసులు అందించిన నిర్మాణాదారులపై ఏన్ని ఫిర్యాదులు వచ్చిన చూసి చూడనట్లు వదిలేస్తున్నారని తెలిపారు. మాదాపూర్ డివిజన్ లోని అయ్యప్ప సొసైటీ, చందా నాయక్ తాండ, సర్వే ఆఫ్ ఇండియాలలోని స్థలం పూర్తిగా కోర్టు పరిధీలో ఉన్న రాజకీయ నాయకుల, అధికారుల అండతో అక్కడ ఎటువంటి పర్మిషన్ లేకుండా జి+5,జి+6,జి+7, జి+8ల స్థాయిలో భారీ ఏత్తున అక్రమ నిర్మాణాలు కోనసాగుతున్న పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వెనుక కింది స్థాయి సిబ్బంది, చైన్‌మెన్‌లదే పూర్తి తతంగం అంతా నడుస్తూందని, వారు ఎంత చెపితే అంత ఇచ్చుకొవాల్సిందేనని లేదంటే కూల్చివేతలు తప్పవు అంటు నిర్మాణదారుల వద్ధ లక్షలలో మామ్ముళ్ళు వస్సూళ్ళు చేస్తు పై అధికారులకు సైతం ముడుపులు అందిస్తున్నారని పుకార్లు జోరుగా వినిపిస్తున్నాయి.

సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధీలోని మాదాపూర్ సర్కిల్ లోని మాదాపూర్ గురుకుల్ ట్రస్ట్ అయ్యప్ప సొసైటీ,సర్వే ఆఫ్ ఇండియాలలో ఎటువంటి పర్మిషన్ లేకుండా వందల కొద్ది అక్రమ నిర్మాణాలు చెపడుతున్న అధికారులకు మాత్రం కంటికి కనిపించడం లేదా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు సియంసి అధికారులకు ఏన్నిసార్లు ఫిర్యాదు చేసిన మేమున్నాము ఏన్ని ఫిర్యాదులు వచ్చిన మేము చూసుకుంటాం అంటు కింది స్థాయి చైన్మెన్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణాదారులకు అండగా ఉండడంతో అక్రమ నిర్మాణాలు మరింతగా పెరిగిపోతున్నాయని, ఇప్పటికైన సియంసి కమీషనర్ , జోనల్ కమీషనర్‌లు మాదాపూర్ సర్కిల్‌లోని అయ్యప్ప సోసైటీ, సర్వే ఆఫ్ ఇండియాలలో చెపడుతున్న అక్రమ నిర్మాణాలపైన, వారికి సహరిస్తున్న అధికారుల పైన వేంటనే చర్యలు తీసుకొవాలని, మాదాపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. కింది స్థాయి టౌన్ ప్లానింగ్ సిబ్బంది, చైన్‌మెన్‌లు ప్రతి స్లాబుకు లక్షలలో వస్సూళ్ళు చేస్తు పై స్థాయి అధికారులకు సైతం వాటాలు అందిస్తూ అక్రమర్జనకు పాల్పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్‌గా విధులు నిర్వహించిన కమీషనర్ సున్నం చెరువులో అక్రమనిర్మాణాలు చెపట్టిన అక్రమ నిర్మాణాలపై నూతన ధతన ఉపయోగించి నిర్మాణాలను నెలమట్టంగా కూల్చివేసి అక్రమ నిర్మాణదారులపై కొరాడ ఘుళిపించారని అదే విధంగా అక్రమ నిర్మాణాలపై వేంటనే చర్యలు తీసుకొవాలని హైడ్రా అధికారులను, సియంసి కమీషనర్, జోనల్ కమీషనర్, సర్కిల్ అధికారులను కోరుచున్నారు.

## రైతుల సంక్షేమ పథకాలు

### హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చెకొలేకర్ లక్ష్మి

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** రైతుల సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి తెలిపారు. మలక్‌పేట్ మార్కెట్లో జరిగిన రైతు సమీక్ష సమావేశంలో ఈ నామ్ ద్వారా సేవలను సమర్థవంతంగా అందిస్తున్నామని, ఇతర రాష్ట్రాల రైతులకు కూడా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. మార్కెట్లో చలివేంద్రాలు, ఆధునిక టాయిలెట్లు, 24 పడకల విశ్రాంతి గదులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

## భార్యను హత్య చేసిన భర్త

**ప్రజాపక్షం/సనత్‌నగర్ :** అనుమాన భూతంతో భర్త చేతిలో భార్య హత్యకు గురైన దారుణమైన ఘటన సనత్‌నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఒరిస్సా రాష్ట్రం జాజిపూర్‌కు చెందిన చంద్రభాను శామ్యూల్ (39) భార్య సుశ్విత(34) ఇద్దరు పిల్లలతో కలిసి సనత్‌నగర్ పిఎస్ పరిధిలోని శివశంకర్ కాలనీ ఫతేనగర్‌లో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చిన చంద్ర భాను తన భార్య ఓ వ్యక్తితో మాట్లాడుతుందన్న క్షణికావేశంలో డంబుల్‌తో భార్య తలపై బలంగా కొట్టాడు. చుట్టు పక్కల వాళ్ళు గమనించి పోలీసుల సమాచారం ఇవ్వడంతో పాటు సుష్మితను దగ్గర్లోని బి బి ఆర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. ఉదయం 6 గంటలకు సుస్మిత మరణించినట్టు డాక్టర్లు తెలిపారు. సనత్‌నగర్ పోలీసులు హత్యా నేరంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# పారదర్శకంగా సంక్షేమ శాఖలో బదిలీల ప్రక్రియ

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉద్యోగుల బదిలీల ప్రక్రియను సంక్షేమ శాఖ పరిధిలో పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా అమలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులకు ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో బుధవారం టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్, టిజిటిడబ్ల్యూఆర్ఇఐఎస్, ఆశ్రమ పాఠశాలలు, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, దివ్యాంగుల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ శాఖలో బదిలీల ప్రక్రియను ఆదర్శంగా నిలిచే విధంగా నిర్వహించాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. దూర ప్రాంతాల్లో దీర్ఘకాలం పని చేస్తున్న వారికి ప్రాధాన్యతను ఇవ్వడంతోపాటు ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులు, దంపతులు ఒకే చోట పనిచేసే స్పౌస్ కేసులు వంటి అంశాలను సానుకూలంగా పరిగణించాలని ఆదేశించారు. దుర్భర పరిస్థితుల్లో విధులు నిర్వహించిన వారికి మానవీయ దృక్పథంతో న్యాయం చేయాలని పేర్కొన్నారు. బదిలీలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి వాటిని ఉద్యోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.ప్రతి దశలో డిజిటల్ పద్ధతులను వినియోగించి మానవ జోక్యం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి వేగంగా స్పందించాలని ఆదేశించారు. ఎలాంటి ఒత్తిడిగాని, ఇతర వ్యక్తిగత ప్రభావాలు లేకుండా నిష్పాక్షికంగా ప్రక్రియ కొనసాగించాలని స్పష్టం చేశారు. గురుకులాల్లో ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి 190 జీవో జారీ చేసినప్పటికీ అమలులో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు అధికారులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో మంత్రి స్పందిస్తూ సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించి అమలు చేసేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి (ఎఫ్ఎసి) సంతోష్, టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఎసి) శారద, టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ అధికారులు అదనపు కార్యదర్శి ఎన్.రాజేందర్ రెడ్డి సంయుక్త కార్యదర్శి నటరాజ్. వెంకన్న, లింగారెడ్డి, రాజు బాబు, వేణు గోపాల్ ,దివ్యాంగుల శాఖ డైరెక్టర్ శైలజ, ఎస్‌సిడిడి ఇంచార్జి సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలు కౌంటర్లు దాఖలు చేయాలి

ప్రజాపక్షం / హైదరాబాద్: అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లలో ప్రతివాద ఎమ్మెల్యేలు కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు మరోసారి ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని, అనంతరం వారం రోజుల్లో పిటిషనర్లు రిప్లయ్ కౌంటర్లు సమర్పించాలని సూచిస్తూ విచారణను జూన్ 25కి వాయిదా వేసింది. బిఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి. ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్‌లపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను స్పీకర్ కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజయ్, పల్ల జేశ్వ ర్ రెడ్డి, సిహెచ్. ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు, అలాగే బిజెపి శాసనసభా పక్షనేత ఎ.మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రతివాదుల తరపు న్యాయవాదులు కౌంటర్లు దాఖలు చేసేందుకు మరింత గడువు కోరగా ధర్మాసనం అనుమతించింది.

## ఐలాపూర్ కూల్చివేతలపై కోర్టు ధిక్కరణ నోటీసులు

ప్రజాపక్షం / హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో హైడ్రా చేపట్టిన కూల్చివేతలు కోర్టు ఉత్తర్వులకు విరుద్ధమంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ కేసులో గతంలో పనిచేసిన పురపాలకశాఖ, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శులతో పాటు హైడ్రా కమిషనర్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తమపై కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. 2024లో చెరువు ఎఫ్‌టీఎల్ పేరుతో ప్రైవేటు భూముల్లో అధికారులు జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే ఆ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ ఇటీవల కూల్చివేతలు చేపట్టారని పేర్కొంటూ ఎం.ఎ. షరీఫ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సి.వి. భాస్కర్‌రెడ్డి విచారించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేశారు.

## 7 నుంచి హైకోర్టుకు వేసవి సెలవులు

ప్రజాపక్షం / హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుకు ఈనెల 7వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వేసవి సెలవులు ఉంటాయని రిజిస్ట్రార్ జనరల్ ప్రకటించారు. అత్యవసర కేసుల విచారణ కోసం ప్రత్యేక వెకేషన్ బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 14, 21, 28, జూన్ 4 తేదీల్లో వెకేషన్ బెంచ్‌లు విచారణలు నిర్వహించనున్నాయి. సంబంధిత కేసులను విచారణ తేదీకి రెండు రోజుల ముందే దాఖలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మొదటి రెండు వారాల్లో జస్టిస్ టి. మాధవీదేవి, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్, జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్‌లు విధులు నిర్వహించనుండగా, తరువాతి రెండు వారాల్లో జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావులు విచారణలు చేపట్టనున్నారు.

## జస్టిస్ తిరుమలాదేవికి హైకోర్టు ఘన వీడ్కోలు

ప్రజాపక్షం / హైదరాబాద్: పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ. తిరుమలాదేవికి బుధవారం హైకోర్టు ఘన వీడ్కోలు పలికింది. జూన్ 2న ఆమె పదవీ విరమణ చేయనున్నప్పటికీ వేసవి సెలవుల నేపథ్యంలో ముందుగానే వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలో మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ తిరుమలాదేవి న్యాయవ్యవస్థకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జస్టిస్ తిరుమలాదేవి మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులతో పాటు న్యాయ మూర్తులు, అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ భుజంగరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ స్మారక చిహ్నం తొలగింపుపై పిటిషన్

ప్రజాపక్షం / హైదరాబాద్: సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ సమీపంలోని రెండో ప్రపంచ యుద్ధ స్మారక చిహ్నాన్ని రోడ్డు అభివృద్ధి పనుల కోసం తొలగిస్తున్నారంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ అంశంపై ముందుగా సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు జె. రామకృష్ణ ఈ పిల్‌ను దాఖలు చేశారు. రిజిస్ట్రీ వ్యక్తం చేసిన అభ్యంతరాలపై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్యారడైజ్ జంక్షన్ నుంచి హకీంపేట వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా యుద్ధ స్మారక చిహ్నాన్ని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. స్మారక చిహ్నానికి ఇరువైపులా ఖాళీ స్థలం ఉన్నందున దానిని కూల్చివేయకుండా రక్షించాలని కోరారు. ప్రభుత్వ తరపు న్యాయవాది స్పందిస్తూ స్మారక చిహ్నాన్ని కూల్చివేయడం లేదని, అవసరమైతే మరోచోటికి తరలించే అంశంపై చర్చలు జరుగుతున్నాయని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం పనులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. ముందుగా అధికారులకు వినతిపత్రం సమర్పించి, ఆ తరువాత ఆ వివరాలను కోర్టు ముందుకు తీసుకురావాలని పిటిషనర్‌ను ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## బిసి జనగణన లేకుంటే కేంద్రం మాట తప్పినట్టే

యుపి మంత్రి ధర్మవీర్ ప్రజాపతికి విజ్ఞప్తి చేసిన విక్రమ్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణనలో బిసి వర్గాల కులగణన తప్పనిసరిగా చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ డిమాండ్ చేశారు. బేగంపేట టూరిజం ప్లాజాలో ఉత్తరప్రదేశ్ పౌర భద్రత శాఖ మంత్రి ధర్మవీర్ ప్రజాపతిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ బిసి వర్గాలపై ఖచ్చితమైన గణాంకాలు లేకపోవడం వల్ల వారికి లభించాల్సిన హక్కులు, అవకాశాలు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదన్నారు. దీనిపై మంత్రి ధర్మవీర్ ప్రజాపతి స్పందిస్తూ బిసి జనగణన డిమాండ్ న్యాయసమ్మతమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో చర్చించి విషయాన్ని ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం నేతలు రావులకోల్ నరేష్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.



## నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దు

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్




ప్రజాపక్షం/హైదరాబాద్ :పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో నిర్మాణాలు, కూల్చివేతల వల్ల ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు నగర పరిసరాల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యర్థాలను అక్రమంగా ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నాలాలు, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారని తెలిపారు. ఐకియా ప్రాంతంలో పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి సుమారు రూ.60 కోట్లు ఖర్చవుతుందని ఆయన చెప్పారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో బుధవారం నిర్వహించిన రివైజ్డ్ కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్ 2025 వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ నగరంలో రోజుకు సుమారు 8 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, అందులో 1700 టన్నులు నిర్మాణ వ్యర్థాలేనని తెలిపారు. కాంక్రీట్, మట్టి, ఇసుక, ఇటుకలు, లోహాలు, ప్లాస్టిక్ వంటి పదార్థాలు వీటిలో ఉంటాయని చెప్పారు. ఒక టన్ను చెత్త రవాణాకు ప్రభుత్వం సుమారు రూ.2,000 ఖర్చు చేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. నిర్మాణ వ్యర్థాలను వేస్ట్ టు వెల్త్‌గా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, రీసైక్లింగ్ ప్లాంట్లు మరింత అవసరమన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ టెండర్లలో 2025 శాతం రీసైక్లింగ్ మెటీరియల్ వినియోగాన్ని తప్పనిసరి చేసే చర్యలు చేపడతామని వెల్లడించారు. 2047 నాటికి హైదరాబాద్‌ను నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి పౌరుడు కాలుష్య నియంత్రణ బాధ్యత తీసుకోవాలని జయేష్ రంజన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నేషనల్ ఛైర్మన్ సి. శేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు జరగాల్సిన అవసరాన్ని వివరించారు. నిర్మాణ వ్యర్థాలను సర్టిఫై చేసే ప్రత్యేక సంస్థ అవసరమని సూచించారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ తెలంగాణ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త నిర్మాణ వ్యర్థాల నిబంధనలు గత మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ అక్రమ డంపింగ్‌ను నివారించేందుకు కఠినమైన పర్యవేక్షణ అవసరమని చెప్పారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ ప్రెజెంటేషన్‌లో భాగంగా ఫతుల్లాగూడ, జీడిమెట్ల, శంషాబాద్, తూముకుంట ప్రాంతాల్లో రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. మరిన్ని ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ సంస్థల ఇంజనీరింగ్ సిబ్బంది, ఎస్కీ సెంటర్ ఫర్ క్లైమేట్ చేంజ్ డివిజన్ హెడ్ డాక్టర్ చంద్రకళ, ఫ్యాకల్టీ నరేష్ సమన్వయం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజు అపాయింటెడ్ డేట్ ప్రకటించాలి

ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న



ప్రజాపక్షం/హైదరాబాద్: టిజిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజైన జూన్ 2 తేదీన అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న కోరారు. టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఎండి. అహ్మద్ అలీ, డి.గోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి జె.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి నగేష్ పటేల్‌లతో కూడిన బృందం బుధవారం ఆర్‌టిసి ఎండి. వై.నాగిరెడ్డిని బస్‌భవన్‌లో కలిసి సంబంధిత వినతిపత్రం అందజేశారు. అలాగే శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రతి ఉద్యోగి నుండి రూ.300 మే నెల వేతనంలో కటింగ్ చేసి, ఆయన కుటుంబానికి అందించాలని లేఖ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎండి వై.నాగిరెడ్డి ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన నివేదికను పరిశీలించి ప్రభుత్వంనకు తగు చర్యల నిమిత్తం పంపించి, తమ వంతుగా యాజమాన్య పరంగా విలీనంనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శరణప్ప, పాపయ్య గౌడ్, ఎఎస్.రెడ్డి, నరేందర్, అలీ, ఉప్పలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుకింగ్ గ్యాస్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన

ప్రజాపక్షం/హైదరాబాద్: కుకింగ్ గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజులలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరి చందన హామీ ఇచ్చారు. తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సలహాదారు కమిటీ ఛైర్మన్ మాజీ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, కమిటీ నాయకులు చామకూర రాజు, అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులు అజయ్ రెడ్డి, నగేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యునుస్ తదితరులు కలిసి బుధవారం సెక్రటేరియట్ లో ఎల్పిజి డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలు కార్మిక శాఖ కార్యదర్శి హరిచందన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టి.చిరంజీవులు మాట్లాడుతూ ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్లు సిలిండర్లు సరఫరా చేసే కార్మికులకు కనీస జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈఎస్ఐ ,పిఎఫ్‌లు ఇవ్వడం లేదంటూ పలు అంశాలు కార్యదర్శి హరిచందన దృష్టికి తీసుకెళ్లారు .ఈ సందర్భంగా కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై స్పందించి డిస్ట్రిబ్యూటర్లకు కార్మిక శాఖ తరపున నోటీసులు పంపిస్తామని, డిస్ట్రిబ్యూటర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు . రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని, వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖ నియమాలను పాటించ కుండా కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## బిఆర్ఎస్ హయంలో ధరణి కారణంగా రైతుల ఆత్మహత్యలు

కెటిఆర్ తన వ్యాఖ్యల్లో పరిమితి పాటించాలి: బల్మూర్ వెంకట్



ప్రజాపక్షం/హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు అహంకారం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసహనం చూపించడం బిఆర్ఎస్ నేత కెటిఆర్ వైఖరి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ విమర్శించారు. ధరణి కారణంగా అనేక మంది రైతులు భూములు కోల్పోయారని, ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ ఏ భాషలో మాట్లాడితే తాము అదే భాషలో సమాధానం ఇవ్వాల్సి వస్తుందన్నారు. కెటిఆర్ తన వ్యాఖ్యల్లో పరిమితి పాటించకపోతే ప్రజల నుంచి గట్టి ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతుల పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు వాస్తవానికి ప్రభుత్వాన్ని విమర్శించడానికే వేదికలుగా మారుతున్నాయని అన్నారు. నిజంగా రైతుల సమస్యలు ఉంటే వాటిని బాధ్యతగా ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కెటిఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, అవసరమైతే డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధమని ప్రకటించాలని సవాల్ విసిరారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోలేదని, ఖమ్మంలో మిర్చి రైతులపై చర్యలు, నేరేళ్లలో కేసులు పెట్టించిన విషయాలను గుర్తుచేశారు. వరి పంటపై తగిన మద్దతు ఇవ్వలేకపోయిన వారు ఇప్పుడు రైతులపై ప్రేమ చూపిస్తున్నట్లు నటించడం ప్రజలకు అర్థమవుతోందని బల్మూర్ వెంకట్ వ్యాఖ్యానించారు.

## పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడంలో విఫలమైంది

టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంలో విఫలమైందని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ వరంగల్ సభకు ఎలాంటి అర్థం లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. వ్యవసాయం దండగ అనే స్థితి నుంచి పండుగగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసి చూపించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 25,40,392 మంది రైతులకు రూ.20,625 కోట్లతో రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. బిఆర్ఎస్ పాలనలో వరి వేస్తే ఉరి అన్న పరిస్థితులు సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. గిట్టుబాటు ధర కోసం డిమాండ్ చేసిన రైతులకు బేడీలు వేసిన ఘటనలను గుర్తు చేశారు. రైతు బంధు పథకం అసలు లక్ష్యాన్ని వదిలి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి నిజమైన రైతు బాంధవుడని, రైతుల పక్షపాతిగా నిరూపించుకున్నారని పేర్కొన్నారు. సూటు బూటు వేసుకొని రైతు వేషం వేసినా ప్రజలు నమ్మరని, నిజమైన న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరిగిందని దయాకర్ అన్నారు.

## నూతన డిజిపిని కలిసిన ఎమ్మెల్యే బండారి




ప్రజాపక్షం/చర్లపల్లి : తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్‌లో కోటి రూపాయల నిధులతో చేపట్టే స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పనులకు సంబంధించిన పరిపాలన ప్రక్రియను వేగవంతం చేయాలని జైళ్ల శాఖ డిజికి సూచించాలని ఆయనను కోరారు.జైలు నుండి వచ్చే వరద నీటి సమస్యకు పరిష్కారం ఏర్పడుతుందని ఆయన వినతి పత్రంలో కోరారు.

## తెలంగాణ హండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దూడం వెంకట రమణ నియామకం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ యువ నేత, టిపిసిసి అధికార ప్రతినిధి దూడం వెంకట రమణకు అరుదైన గౌరవం లభించింది. సుదీర్ఘ కాలం పార్టీలో వివిధ విభాగాల్లో సేవలు అందించిన ఆయనకు... తెలంగాణ రాష్ట్ర హండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బుధవారం నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో ఆయన చురుకుగా పాల్గొంటూ, ప్రజా సమస్యలపై స్పందించినందుకు ఈ గుర్తింపు లభించిందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేశాయి. అయితే, ఈ సందర్భంగా దూడం వెంకట రమణ మాట్లాడుతూ... ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితర పార్టీ పెద్దలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బడా రియల్ ఎస్టేట్ సంస్థల వైపు కన్నెత్తి చూసే దమ్ము హైడ్రాకుందా?

నాదర్గుల్‌లోని వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా చేస్తుంటే ఎందుకు నిద్రపోతున్నారు

ఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్: నాదర్గుల్‌లోని వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి, అందులోని చెరువును రియల్ ఎస్టేట్ రాబందులు కబ్జా చేస్తుంటే ఎందుకు నిద్రపోతున్నారని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ప్రభుత్వ భూములను, అందులోని చెరువులను, ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేస్తూ , కంచెలు వేసి, కబ్జాలకు పాల్పడుతున్న బడా రియల్ ఎస్టేట్ సంస్థల వైపు కన్నెత్తి చూసే దమ్ము హైడ్రాకు ఉందా? అని ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం, నాదర్గుల్ పరిధిలోని సర్వే నంబర్ 613 (119) కాసుబాగ్ కంచలో వేల కోట్ల రూపాయాల విలువైన ఉన్న 373 ఎకరాల, ప్రభుత్వ భూముల ను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా నుంచి, పోలీసుల వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ నాదర్గుల్‌కు చెందిన రైతులు హరీశ్ రావును బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపైన హరీశ్ రావు వెంటనే స్పందిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, హైదరాబాద్ సిపి సజ్జనార్, స్థానిక ఆర్‌డిఒ, ఎంఆర్‌ఒలకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వ సీలింగ్ భూములకు కలెక్టర్, ఆర్‌డిఒలే కస్టోడియన్లుగా ఉంటారని, ఇది ప్రభుత్వ భూమి అని సుప్రీం కోర్టులో ఫైల్ చేశారని, ఇప్పుడు ప్రైవేట్ వాళ్లు కంచెలు వేస్తుంటే మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. వెంటనే ఆ కంచెలను తొలగించి, తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు మళ్లీ సాగు చేసుకునే అవకాశం కల్పించాలని, ముదిరాజ్ లకు చెరువులో చేపలు పట్టుకునే హక్కును కల్పించి, చెరువుకు వెళ్లే ఫీడర్ ఛానళ్లను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గుడిలో పూజలు చేసుకునేందుకు ప్రజలను అనుమతించాలని అధికారులను కోరారు. ఆదిభట్ల పోలీసులు రియల్ ఎస్టేట్ మాఫియాకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. దీనిపైన రైతులు ఫిర్యాదు చేస్తే స్వీకరించడం లేదని,. పైగా రైతులపైనే దొంగ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రైతులకు న్యాయం జరగకపోతే తానే స్వయంగా బిఆర్ఎస్ బృందంతో కలిసి నాదర్గుల్ భూములను సందర్శిస్తానని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## హెచ్ఎంటి నగర్‌లో సిమెంటు రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాపక్షం/ఉప్పల్ : నాచారం సర్కిల్ లో హెచ్ఎంటి నగర్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి వేగం పెరిగింది. రూ.1.10 కోట్ల వ్యయంతో చేపడుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ కాలనీ వెల్ఫేర్ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ విన్నపం మేరకు హెచ్ఎంటి నగర్‌లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.1.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే హెచ్ఎంటి నగర్ కమాన్ నుంచి సీసీఎంబి క్వార్టర్స్ వరకు సీఆర్ఎంపీ రోడ్ల పనులకు కూడా నిధులు తీసుకొచ్చామని పేర్కొన్నారు.కాలనీలో ఇంకా ఎక్కడైనా రోడ్ల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే ఎమ్మెల్యేతో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రామ్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు యాదగిరి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బాల్‌రెడ్డి, మక్బూల్, కట్ట బుచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



